నల్గొండ జిల్లా నార్కట్పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గౌలి కార్ శ్రీనివాస్ తండ్రి ఈశ్వర్ జీ మృతదేహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించిన వి 3 ఛానల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ. నివాళులర్పించిన వారిలో అమ్మనబోలు గ్రామ మాజీ సర్పంచ్ సత్తయ్య గౌడ్ ఉన్నారు. (విశ్వంభర, నార్కట్ పల్లి)

ఆ గ్రామాలు ఎటువైపు.. మళ్లీ చర్చలోకి సరిహద్దు గ్రామాలు

విశ్వంభర, ఆసిఫాబాద్ : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని వివాదాస్పద గ్రామాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సర్వే ప్రక్రియలో భాగంగా సరిహద్దులోని పరంధోళి, కోట, లెండిగూడ, పరంధోళి తండా, శంకర్ లొద్ది, ముకద్దంగూడ గ్రామాలకు వెళ్లిన సర్వే అధికారులకు గ్రామస్తుల నుంచి చుక్కెదురైంది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తమకు వర్తించడం లేదని, పంట రుణాలు, భూమి పట్టాలు ఇవ్వడం లేదని పేర్కొంటూ అధికారులు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించేందుకు గ్రామస్తులు నిరాకరించారు. అధికారులు పలుమార్లు గ్రామాలకు వెళ్లి గ్రామస్తులతో చర్చలు జరిపినా వారు వినిపించుకోలేదు. ప్రభుత్వం పట్ల అసంతృప్తితో తాజాగా మంగళవారం ఆయా గ్రామాల ప్రతినిధులు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి భూ హక్కులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తాము మహారాష్ట్రలోనే కొనసాగాలని కోరడంతో ఈ అంశం మరోసారి చర్చకు దారితీసింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల పరిధిలోని పరంధోళి, ముకద్దంగూడ, మహారాజ్‌గూడ, కోట, అంతాపూర్, ఇంద్రపూర్, ఏసాపూర్, నారాయణగూడ, బోలాపటార్, గౌరీ, లెండిగూడ, పద్మావతి గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండేవి. అయితే భౌగోళిక, సాంస్కృతిక కారణాలను చూపుతూ 1987లో మహారాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామాలను చంద్రపూర్ జిల్లా జివతి తాలూకాలో చేర్చడంతో వివాదం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ గ్రామాల్లో రెండు రాష్ట్రాల ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. గ్రామాలకు ఇద్దరు సర్పంచులు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రాతినిధ్యం కొనసాగుతోంది. అంతేకాకుండా, ఈ గ్రామాల ఓటర్లు రెండు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లోనూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ సరిహద్దు వివాదం పరిష్కారం కోసం అప్పట్లో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి కేకే నాయుడు కమిషన్‌ను ఏర్పాటు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ 12 గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కే చెందినవని పేర్కొంది. అయితే దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కేసు ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. గత ఏడాది ఈ గ్రామాలు మహారాష్ట్ర పరిధిలోకి వస్తాయని మహారాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులతో వ్యాఖ్యానించడం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ గ్రామస్తులు మహారాష్ట్ర సీఎంను కలిసి వినతిపత్రం అందజేయడంతో ఈ అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.

1956కు ముందే మా గ్రామాలు మహారాష్ట్రలోనే ఉన్నాయి..

1956లో భాషాప్రయుక్త రాష్ట్రాల పునర్విభజనకు ముందే తమ గ్రామాలు మహారాష్ట్రలోనే ఉన్నాయని సామాజిక కార్యకర్త రణ్‌వీర్ రాందాస్ తెలిపారు. మరాఠీ మాట్లాడే తామంతా భాషా ప్రాతిపదికన మహారాష్ట్రలోనే కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్నామని చెప్పారు. ప్రస్తుతం తాము సాగు చేస్తున్న భూములు తెలంగాణలో కాకుండా సరిహద్దు వివాదంలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి భూ సర్వే నిర్వహించి, భూ హక్కు పత్రాలు అందజేస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

108 వెండీ కలిశాలతో అభిషేకం



విశ్వంభర, ఎల్బీనగర్ : గడ్డి అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం లో 2వ పుష్కర బ్రహ్మోత్సవం లో 108 వెండీ కలిశాలతో అభిషేకం జరిగినది. ఆకురార్పణం, విశ్వక్సెన ఆరాధన రుత్వికవరణ జరిగాయి. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పాల్థి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, ఊర నరసింహ గుప్తా, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, మార్గం రమేష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

''నిమ్మకాయ.. నీకెందుకు భయం'' చిత్ర షూటింగ్ ఘనంగా ప్రారంభం



విశ్వంభర, బంజారా హిల్స్ : ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కుతున్న "నిమ్మకాయ.. నీకెందుకు భయం" తెలుగు చిత్ర షూటింగ్ యూసఫ్ గూడ సారధి స్టూడియోలో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మెయిన్ కరెక్టర్ హీరో సుమన్, డైరెక్టర్ డి ఎస్ రెడ్డి , చౌదరి {ప్రొడ్యూసర్ }హీరో భూపతి, హీరోయిన్ స్వప్న నటిస్తున్న మూవీ షూటింగ్ ప్రారంభం లో ముఖ్య అతిథిగా టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని క్లాప్ కొట్టి ప్రారంభించి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న కథలు, నూతన ఆలోచనలతో రూపొందుతున్న చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయని అన్నారు. నల్ల మల్ల అడవిలో భవనం లో నిధి వుంటుంది అని నిమ్మకాయ పెడితే తెలిస్తే మంచి కథ, భయంకర దృశ్యం అని నాణ్యమైన నిర్మాణ విలువలు, ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణుల సమిష్టి కృషితో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా విజయవంతమవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సినీ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ రామకృష్ణ గౌడ్, సత్యనారాయణ ,చిత్ర యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

కేసీఆర్ గొప్పగా పాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారు?: జూపల్లి

విశ్వంభర, హైదరాబాద్: కేసీఆర్ గొప్పగా పరిపాలిస్తే ప్రజలు ఎందుకు ఓడించారని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని ఆయన అప్పుల పాల్జేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలో జూపల్లి స్పందించారు. కేసీఆర్ చేసిన అప్పులపై శాసనసభలో లెక్కలతో సహా రుజువు చేశామన్నారు. రాష్ట్ర ప్రజల జేబులకు చిల్లు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న అప్పు ఎవరు కడతారని జూపల్లి ప్రశ్నించారు. ఇదే అంశాన్ని శాసనసభలో అడిగితే ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పలేదన్నారు.

దేశంలోనే తొలిసారి.. ఉస్మానియాలో రోగికి ఒకేసారి ఐదు అవయవాల మార్పిడి

విశ్వంభర, హైదరాబాద్ : ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు మరో ఘనత సాధించారు. దేశంలోనే తొలిసారి ఒకేసారి, ఒకే రోగికి ఐదు అవయవాలను విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. సిరిసిల్లకు చెందిన యువ ఇంజినీర్‌కు జీర్ణాశయం, డ్యుడెనమ్ (ఆంత్రమూలం), ప్యాంక్రియాసిస్, చిన్నపేగు, పెద్ద పేగు అవయవాలను ఒకేసారి మార్పిడి చేశారు. అత్యంత క్లిష్టమైన ఈ శస్త్ర చికిత్స దాదాపు 36గంటలపాటు కొనసాగింది. ఉస్మానియా వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగ ప్రతిష్ఠను మరింత పెంచిందని తెలిపారు.ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పని చేసిన వైద్యులు, అనస్థీషియా, నర్సింగ్, క్రిటికల్ కేర్, తదితర సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక, ప్రపంచస్థాయి వైద్య సేవలందుతున్నాయనడానికి ఉస్మానియా వైద్యుల ఘనతే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యున్నత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు.



అక్రమ ఎంట్రీలకు చెక్..

ధరణి, భూ భారతిపై ప్రత్యేక కమిటీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ధరణి, భూ భారతి పోర్టళ్లలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై రాష్ట్రప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ధరణి పోర్టల్‌పై కొనసాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్ పురోగతిపై జరిగిన సమీక్షలో కొన్ని ఆందోళనకర అంశాలు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు లోకేశ్ కుమార్ తెలిపారు. ధరణి పోర్టల్ సిస్టమ్ నిర్మాణంలో సహజసిద్ధమైన భద్రతా లోపాలు ఉన్నాయని, వాటిని కొందరు అక్రమ శక్తులు దుర్వినియోగం చేసి కొన్ని మాడ్యూళ్ల ద్వారా అనధికారిక ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. అలాగే నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రూపొందించిన భూ భారతి పోర్టల్ కూడా ధరణి ఆధారిత సాంకేతిక నిర్మాణాన్ని అనుసరించడం వల్ల అదే తరహా లోపాలకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆనాడు ధరణి పోర్టల్ ద్వారా మాడ్యూల్స్ రూపొందించిన వ్యక్తులే దీని వెనుక ఉన్నట్లుగా ప్రభుత్వం అనుమానిస్తుంది. ఈ నేపథ్యంలో బాధ్యులను గుర్తించడం, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ప్రారంభించడం, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు సూచించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని వెల్లడించారు.

ఈ కమిటీలో సభ్యులు..

మిక్కిలినేని మనుచౌదరి, ఐఏఎస్ - కలెక్టర్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, ప్రతీక్ జైన్ (ప్రతీక్ జైన్), ఐఏఎస్ - కలెక్టర్, సంగారెడ్డి, అనుదీప్ దురిశెట్టి, ఐఏఎస్ - సంయుక్త కార్యదర్శి, ఐటీ & కమ్యూనికేషన్స్ శాఖ, హర్షవర్ధన్, ఐపీఎస్ - తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, అపూర్వ్ చౌహాన్, ఐఏఎస్ - ప్రాజెక్టు డైరెక్టర్, సీఎంఆర్ఓ, మంద మకరంద్, ఐఏఎస్ - ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటీడీఏ, ఉట్నూర్, ఏ. సంపత్ - డీఎస్పీ, తెలంగాణ సీఐబీ, సైబర్ క్రైమ్స్, ఎం. సుభాషిణి - డీఐజీ, రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ శాఖ, ఏ. శ్రీనివాస సుబ్బారావు - సీనియర్ డైరెక్టర్ (ఐటీ) ఎన్ఐసీ.

మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు ఎన్ఐసి పూర్తిగా కొత్తగా, అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సరికొత్త సిస్టమ్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కమిటీ 15 రోజుల్లోగా ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించనుందని, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని లోకేష్ కుమార్ పేర్కొన్నారు. భూముల రికార్డుల భద్రత, సమగ్రత, పారదర్శకత విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని స్పష్టం చేశారు.

'ఇడుపు కాయితం' మీద ఎందుకింత రచ్చ

సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ఆంధ్రోళ్లు తెలంగాణ భాష మీద, ఆలోచనలు, సంస్కృతి మీద పెత్తనం చేస్తున్నారని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇడుపు కాయితం' పదం మీద ఇంత రచ్చ ఎందుకు చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. గతంలో 'బలగం' సినిమాలో మూలుగ బొక్క కోసం కొట్లాడితే.. దాని కోసం అలా కొట్లాడుతారా అని సోషల్ మీడియాలో అవహేళన చేస్తూ రచ్చ చేశారని ఫైర్ అయ్యారు. అంతెందుకు కేరళ వాళ్లు ఒకసారి పెళ్లిలో పాపడ్ కోసం కొడితే గొడవలు అయ్యాయని గుర్తు చేశారు. కేవలం పాపడ్ కోసమే కొట్లాడితే మూలుగు బొక్క కోసం కొట్లాడరా అని అన్నారు. తమ భాషని, సంస్కృతిని ఆంధ్రోళ్లు ఎక్కిరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఆంధ్రవాళ్లకు బానిసగా మారిపోయడని.. అందుకే మాట్లాడటం లేదని పాశం యాదగిరి అన్నారు. తన భర్తని అరెస్ట్ చేయొద్దు అన్నందుకు జర్నలిస్ట్ భార్య నడుము మీద చెయ్యి వేసి ఏపీ పోలీసులు లాగడం దుర్మార్గమని దుమ్మెత్తిపోశారు. ఆంధ్ర పోలీసులు వచ్చి తెలంగాణ బిడ్డ మీద చేతులేస్తే సీఎం నోరు కూడా విప్పడం లేదన్నారు. ఓ తెలంగాణ జర్నలిస్టు అరెస్ట్ ఇంత తంతు జరిగితే.. ఏ ఒక్క పత్రికలో కూడా రాలేదని, అవన్ని సిగ్గులేని వాళ్ల చేతుల్లో ఉన్నాయని అన్నారు. అసలు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కాదని.. చంద్రబాబు నాయుడే అన్నట్లుగా ఉందని పాశం యాదగిరి కామెంట్ చేశారు.

నితిన్ నబీన్ తెలంగాణ టూర్ అట్టర్ ఫ్లాప్

- టీపీసీసీ చీఫ్ తీవ్ర విమర్శలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని, ఆయన మూడు రోజుల పర్యటనలో ఏం చేశారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. జాతీయ అధ్యక్షుడు రాష్ట్రానికి వస్తే పట్టుమని 2 వేల మందిని కూడా పోగు చేసుకోలేని పార్టీ బీజేపీ అని, బీజేపీకి తెలంగాణలో అవకాశం లేదు, అవసరం లేదన్నారు. బుధవారం గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ పరిస్థితుల మీద, కుల సమీకరణల మీద ఉద్యమం మీద నితిన్ నబీన్ కి అవగాహన ఉందా? వికసిత్ భారత్ లో తెలంగాణ లేదా? అని నిలదీశారు. బీజేపీ ముక్త్ భారత్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల గురించి నితిన్ నబీన్ ఎందుకు మాట్లాడలేదు? అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఇంకా ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసిన కాంగ్రెస్ ను ఢీ కొట్టలేరని, పేద ప్రజలకు మోడీ ప్రభుత్వం ఇచ్చింది ఏమీ లేదన్నారు. 90 శాతం ప్రతిపక్ష నాయకుల మీద ఈడీ దాడులు చేయించారని, సీబీఐ, ఈడీలను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సంపన్న వర్గం కోసం కేంద్రంలోని బీజేపీ పని చేస్తోందని, అయోధ్య దోపిడీ గురించి నబీన్ ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు. వేల మంది ప్రాణత్యాగం, సోనియా గాంధీ వల్ల తెలంగాణ సాకారమైందని, కాంగ్రెస్ పార్టీకి మినహాయించి తెలంగాణలో ఏ పార్టీకి చోటు లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలా గుండెల్లో కాంగ్రెస్ పార్టీ శాశ్వతమన్నారు. కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఫాంహౌస్ కు పరిమితం అయ్యారని, బావ, బామ్మర్ది తమపై విష ప్రచారం చేస్తున్నా, తెలంగాణ ప్రజలు తమ పార్టీ వైపు ఉన్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరిక

విశ్వంభర, నాగోల్ : హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ ఎక్స్ రోడ్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు ఉపయోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం కూడా శిక్షార్హమైన చర్యేనని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని, తమ పరిసరాల్లో గంజాయి విక్రయాలు , ఇతర అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ ఐ రమేష్, ఎస్ ఐ ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలల్లో ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ పూర్తి కావాలి

విశ్వంభర, గద్వాల కలెక్టరేట్ : ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంను పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ దిశగా అధికారులు రెండు నెలల్లో ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ప్రైమరీ డిక్లరేషన్ పూర్తయి అవార్డు స్థాయిలో ఉన్న భూముల వివరాలను అడిగారు. అనంతరం వివిధ మండలాల వారీగా ఆయా గ్రామాల పరిధిలో చేయాల్సిన భూ సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలల్లో ప్రాజెక్టుకు అవసరమైన పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాలని ఆదేశించినందున అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూ సేకరణ పై ప్రతి వారం సమీక్ష సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తామని, అధికారులు ఎప్పటికప్పుడు పురోగతి సాధిస్తూ కావాల్సిన భూసేకరణ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా చేరుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ... రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని భూసేకరణ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనిచేయాలన్నారు. భూసేకరణ వేగవంతం కావడానికి అవసరమైతే అదనపు సర్వేయర్లను నియమిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఆయా మండలాల తహశీల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108